# సుఖంలేని మనిషి

జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్ అనిచెప్పి ఓ పెద్ద బట్టలదుకాణం పెద్ద బజారు రోడ్డుమీద ఆర్నెల్ల క్రితం వరకూ వెలిగిపోతూవుండేది. ఈ కథ జె. వెంకటేశ్వర్లుఅండ్ సన్స్‌వారి బట్టల దుకాణం గురించి మాత్రం కానే కాదు.

ఆ బట్టల దుకాణం కొన్ని లక్షల వ్యాపారం చేసిందని వినికిడి. జె. వెంకటేశ్వర్లు వూళ్ళో నాలుగు మేడలు కట్టించడం గూడా ఆ వ్యాపారం యొక్క ప్రయోజకత్వమేనని వదంతి.

ఆ దుకాణం అస్తమానం రద్దీగా వుండేది. డాక్టర్లూ, ప్లీడర్లూ, కాలేజీ కుర్రాళ్ళూ, ఆఫీసర్లూ, పొద్దుపోని ఆస్తిపరులూ మొదలైన పచ్చటి మనుషులు చాలా మంది అక్కడ ఖాతాదారులు. జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్‌లో కొన్న గుడ్డ చాలా ఖరీదైనదీ, మంచి శ్రేష్ఠమైనదీ అని పెద్ద నమ్మకం

జనాభాకి! ఆ కొట్టు యింద్ర భవనంలా వుండేది. ఆ కొట్లో మనుషులూ బాగుండేవారు.

మరీ బాగుండేది మిస్ సుబ్బులు! ఆ అమ్మాయి ఆ కొట్లో సేల్స్ గర్ల్, ఆ కొట్టు కొచ్చే సగానికి సగం మంది కేవలం సుబ్బుల్తో కాస్త కాలక్షేపం కోసమని చెప్పేస్తే అతిశయోక్తి కాదు.

జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్‌కి వాస్తవమైన యజమాని జె. వెంకటేశ్వర్లు మాత్రమే! ఆ ఆసామికి గుండెనొప్పి, ఆయాసం. దడ అనే మామూలు వ్యాధి ఒక అలంకారం. అంచేత యజమాని పదవి ఒక నమ్మిన మనిషి చేతిలో పెట్టేడు. ఆ మనిషి పేరు సుబ్బారావు. వి. సుబ్బారావు.

చాలా మంది ఆశ్చర్యపోయే వారు. జె. వెంకటేశ్వర్లుకున్న ముగ్గురు కొడుకులూ ఉత్త చవటలని జనం ఉద్దేశం కాదు గానీ వాళ్ళెవరికీ దక్కని స్థానం ఎవడో పరాయి వాడు వి. సుబ్బారావు కెలా దక్కిందని ముక్కుల మీద వేళ్ళేసుకునేవారు. డిగ్రీలు పుచ్చుకున్న నిరుద్యోగులకీ, పేదరికంలోంచి బైట పడిపోవాలనుకునే సామాన్యమైన మనుషులకీ వి. సుబ్బారా వున్నూస్తె వొళ్ళు మండుకొచ్చేది. అతని అదృష్టానికి అసూయా కలిగేది. ఆ కొట్టు కొచ్చే ఖరీదైన ఖాతాదార్లు వి. సుబ్బారావుని మర్యాదగా పలకరించడం చూసిన మూడో మనిషి (వి. సుబ్బారావుకి ఆత్మీయుడైన పక్షంలో) చచ్చేంత సిగ్గుపడిపోయేవాడు.

అంతలా వెలిగిపోయేడు వి. సుబ్బారావు.

కానీ - ఆర్నెల్ల క్రితం జె. వెంకటేశ్వర్లుకి గుండె కొట్టుకోవడం మరి ఆగిపోయింది. జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్ లోని పెద్ద మనిషి, యోగ్యుడు, దూరదృష్టి కల వాడూ, అదృష్టవంతుడూ, మహానుభావుడూ కన్నుమూసే డని స్థానిక పత్రికలు ఉద్ఘాటించేయి, సభల్లో తీర్మానాలూ చోటు చేసుకున్నాయి. వారం రోజులపాటు మూసిన జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్ దుకాణం మరింక తెరవనే లేదు. దానికి జనం ఆశ్చర్యపోనూ లేదు. ఏమంటే వాళ్ళందరికీ అండ్ సన్స్ గాళ్ళ చాకులాటి తెలివి తేటలు ఎప్పట్నుంచో తెలుసు.

ఈ మహత్తర భాగ్యంకోసం అండ్ సన్స్ ఎంతకాలం నుంచో యెదురు చూస్తున్న వైనమూ తెలుసు. అండ్ సన్స్ బట్టల వ్యాపారం మానుకుని మిస్ సుబ్బుల్తోసహా మదరాసు వెళ్ళిపోయారు. అక్కడ వాళ్ళందరూ కలిసి తెలుగు సినీమా తీసే యేర్పాటులో తలనిండా మునిగిపోయేరు. ప్రస్తుతం జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్ స్థానంలో రెండు డ్రింక్ షాపులూ, ఒక "మందు" దుకాణమూ వెలిశాయి.

ఈ విపత్కర సంఘటనకి గొప్ప బాధపడ్డది కేవలం వి. సుబ్బారావొక్కడే. ఎంచేతంటే దేవుడులాటి యజ మానీ, ఇంద్ర పదవిలాటి ఉద్యోగవూ దూరమయ్యాయి కదా!

కాబట్టి ఇది వి. సుబ్బారావు కథ మాత్రమే!

* * *

ఉద్యోగం వూడిపోయిన లగాయితూ — అతను ఒక్కొక్కసారి జీవితాన్ని గురించీ, ఒక్కొక్కసారి ప్రేమగురించీ, ఎక్కువ సార్లు జీవితం ప్రేమ రెండిటిని గురించీ ఆలోచించడం నేర్చుకున్నాడు. జీవితం గురించి ఆలోచించిన క్షణం జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్ గుర్తుకొచ్చి ఆశ్చర్యపోతాడు. ప్రేమ గురించి ఆలోచించిన క్షణం చంద్రావతి జ్ఞాపకమొచ్చి బాధ పడిపోతాడు. టూకీగా అతని వ్యాపకం యిది:

చంద్రావతి యోగ్యురాలని తెలుసు. కాదేమోనన్న అనుమానం జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్‌లో పనిచేస్తున్నప్పుడు కలిగింది కాదు. ఆ రోజుల్లో పరాయి విషయాలు ఆలోచించేందుకు టైముండేది కాదసలు. కాని, ఇప్పుడిప్పుడు చంద్రావతిని తలచుకుంటూంటే భయం వేస్తోంది.

చంద్రావతి నర్సు ఉద్యోగం చేస్తున్న ఇల్లాలు. రెండేళ్ళ క్రితం కాబోలు చంద్రావతికి సుబ్బారావుకి పెళ్ళయింది. ఆ పెళ్ళి చాలా సందడిగానూ, ఆనందంగానూ, కాంతివంతంగానూ కాలేదు. అభిమానాలూ, పట్టుదలలూ, పంతాల మధ్య నలుగు రైదుగురు ముఖ్యమైన స్నేహితుల సమక్షాన నిరాడంబరంగా జరిగి పోయింది. వాళ్ళిద్దరి పెళ్ళి అంత నీరసంగా, బద్ధకంగా జరగడంలో కథా వుంది.

ఆ మధ్యెప్పుడో సుబ్బారావుకి జబ్బేదో చేయడం మూలంగా హాస్పిటల్లో నడుం వాల్చవలసి వచ్చింది. అతనికి హాస్పటలంటే మహా అసహ్యం. అయినా తప్పిందికాదు లేకపోతే జబ్బుముదిరి భూమ్మీద నూకలుకూడా నోచుకో

లేవని బెదరగొట్టారు. భయంభయంగానే హాస్పిటల్ మంచం మీద చేరేడు.

రెండు రోజుల వరకూ మంచం దగ్గరకొచ్చే మనుషులమీద అతనికాట్టే ఆస క్తివున్నదికాదు. తన జబ్బు గురించి దిగులుగానూ కొంచెం ఏడుపుగానూ వుండేది.

ఆ స్థితిలో చంద్రావతి కలిగింది. పున్నమిలాటి చందమామకీ, చంద్రావతికీ పోలిక జేసి చెప్పకం అలంకార రీత్యా దోషమేమీ కాదు. అంత చల్లగానూ, అంత వెల్తురుగానూ అంత అందంగానూ వుంటుంది చంద్రావతి.

మందుపోసేది. మాడిపోతూన్న నొసటిమీద చల్లటి చేతి స్పర్శతో అమృతం కురిపించేది. అప్పుడనుకునే వాడతను – "చంద్రా! నువ్వు దూరం కావద్దు అసమానం నువ్వు నా దగ్గరే వుండిపో. నన్ను విడిచి వెళ్ళిపోతే నేను బతకలేను. నీలో యేదో వింత ఆకర్షణ వుంది; నన్ను అలరిస్తోందది. చంద్రా – నువ్వు దూరంకాకు, నన్ను విడిచిపెట్టొద్దు."

ఓనాటిరాత్రి అతనికి టెంపరేచర్ ఎక్కువయ్యింది. అప్పుడతను నిజంగా పలవరించేడు. ఆ పలవరింతలు విన్న చంద్రావతి మొదట్లో ఖంగారు పడ్డది. ఆనక సర్దుకుంది.

సుబ్బారావు నిర్ణయం విన్న తల్లీ తండ్రీ, అన్నదమ్ములూ వెరశి ఆత్మబంధువులంతా నోరూ నెత్తీ మొత్తుకున్నారు, "నీ కెవడ్రా ప్రేమగురించి చెప్పాడు! పోనీ ప్రేమించేవాడివి ... హావ్వ ... సుబ్బారావోరేయ్! నువ్వు నీ జన్మలో బాగుపడవు. తెలిసిందా, నువ్వు నీ యిష్టంమీద

పెళ్ళి చేసుకుంటే నా యిష్టంమీద నువ్వు బతకడం లేదన్న మాటేగదా! వెళ్ళిపోవోయ్! ఈ యింట్లోంచి వెళ్ళితే, మళ్ళీ నీ దరిద్రపుగొట్టు మొహం నాకు చూపించకు” అన్నాడు తండ్రి తతిమ్మా వాళ్ళందరి కన్నీళ్ళు గమనిస్తూ కూడా.

వి. సుబ్బారావు కివన్నీ బాగా గుర్తుండిపోయేయి గుర్తుండకూడదను కున్నవన్నీ మరిచిపోయే అవకాశాన్ని అండ్ సన్స్ తినేశారు.

చంద్రావతి యింకా నర్సుద్యోగం చేస్తోనేవుంది. చంద్రావతి పతివ్రతా శిరోమణి అని నాగరిక సుబ్బారావు సర్టిఫికెటిచ్చేడు. చంద్రావతిని చూసి భయపడుతున్నది ఆ నాగరికి సుబ్బారావు తాలూకు అవసరమైన ఆలోచనలు. అందుచేతనే అతను కోలుకోలేక పోతున్నాడు.

ఈ రోజున_వి. సుబ్బారావు వాళ్ళబ్బాయి తొమ్మిది నెలల వాణ్ణి యెత్తుకుని ఆడిస్తున్నాడు యింట్లో. ఆ కుర్రాడి బోసినవ్వు ముద్దొచ్చే చిన్ని చిన్ని మాటలూ, అప్పుడప్పుడూ వాడి తాలూకు మెత్తని తాపులూ అనుభవించడం లేదతను. అతని మనసు మదరాసు మెయిల్మీద, అందులో ఖరీదైన కంపార్టుమెంటులో, అతివిలువైన సీట్లో ముద్దబంతి పువ్వులా కూర్చునుండగల సుబ్బుల్ని పలవరిస్తోంది. సుబ్బులుకి సొంతమైన రంగుల జీవితాన్ని ఊహిస్తోంది.

సుబ్బులూ పైకొచ్చేశావ్ ఫో! నీ దరిద్రాన్ని అండ్ సన్స్ తీర్చిపారేశారు. నువ్వైనా సుఖపడు సుబ్బులూ! నీకు గతం వెధవది; నిజం సుబ్బులూ! కానీ నాగతం బంగారంతో సమానం. నే నిప్పుడేమో వెధవని. ఏం చేతగాని వెధవని.

నీకూ నాకూ చాలా భేదం ఉందోయ్ సుబ్బులూ! పూర్వం నీకు డ్రింకు తాగడం చాతనొచ్చేదిగాదు, ఎలా తాగాలో నన్నడిగేదానివి. ఇప్పుడేం తాగుతున్నావో మరి! పోన్లే సుబ్బులూ! అభిమానముంది ఇంత ఉత్తరమైనా రాశావ్. తప్పకుండా వొస్తాను. వొచ్చి ఖరీదు పెరిగిన నీతో నాలుగు నిముషాలపాటు నా చేదుజీవితాన్ని మనవిచేస్తాను సుబ్బులూ, సుబ్బులూ నువ్వు పెళ్ళిచేసుకుంటావా? ఎవర్ని చేసుకుం టావ్? ఇంకా ఆ రెండు జెడలే వేస్తున్నావా? నా మాటడు గుతే అవే నీకు నప్పుతుంది. తారామణీ! అఖిలాంధ్ర ప్రజలకి పరిచయం కాబోతూన్న ఒకప్పటి పేదరాలా! నీకు నా ఆశీ స్సులు."

సుబ్బారావు కనుకొలకుల్లో నీళ్ళు నిలిచేయి! ఎంచే తంటే జెలసీ, అందానికి మధ్యనున్న భావమేదో అతన్ని పూర్తిగా నింపేసింది. ఏమైతేనేం సుబ్బుల్నితలుచుకుని ఏడ్చే సేడు సుబ్బారావు: వి. సుబ్బారావు.

అతనీ అవస్థలో ఉన్నప్పుడు చంద్రావతి పిలిచింది. మూడ్డోసారిగాబోలు ఉలిక్కిపడి, తెప్పరిల్లి పూంకొట్టేడు సుబ్బారావు.

"అన్నం వొడ్డించేను."

"అఖ్ఖర్లేదు, చంద్రా! ఆకలవడంలేదసలు: నువ్వు తినేయ్."

"ఇప్పుడు నా సంగతేగావల్సొంది. లేవండి చల్లారి పోతుంది."

బుజ్జిగాడ్ని భుజానవేసుకుని సుబ్బారావు వంటగది

లోకి వెళ్ళేడు. వంటగదిలో రెండు కంచాల్లోనూ వొడ్డించింది చంద్రావతి. బుజ్జిని నేలమీదికిదించి, చొక్కా దులుపుకుని కసిగా అనేశాడు సుబ్బారావు.

"చంద్రా నువ్వు నన్ను పూర్తిగా అవమానించేస్తున్నావ్. నీకు తెలుసా నువ్వు నన్ను తినేస్తున్నావు. మనిషిని పున్నపళంగా చంపేస్తున్నావ్ నువ్వు."

సుబ్బారావు కెక్కిన పిచ్చిసంగతి చంద్రావతికి పూర్తిగా తెలుసు. అందుకే తలొంచుకు కూర వొడ్డిస్తోంది. సుబ్బారావు గది గుమ్మానికి ఆనుకుని రెండు చేతుల్తోనూ తల సవరించుకుంటూ అన్నాడు!

"చంద్రా! పోనీ ఓపని చేయలేవూ?"

చంద్రావతి తలెత్తి చూసింది.

"మరేం లేదు. నువ్వు ఖంగారు పడొద్దు. నేను నిజమే చెప్తున్నాను. నే చెప్పింది పూర్తిగా విని ఆనక ఆలోచన చేసి చెప్పు. ఫర్లేదు కాస్త ఆలస్యమైనా నీ నిర్ణయం చెప్పేయ్."

"చెప్పండి నన్నేం చేయమంటారు?"

సుబ్బారావు చంద్రావతి వేపు నిశితంగా చూసేడు. చెప్దామనుకున్న మాటకాస్తా గుండెల్లోనే పేలిపోయింది. గిర్రున వెనక్కు తిరిగి హాల్లోకి వచ్చేడు. పడక కుర్చీలో కూర్చుని యింటి టాపు వేపు చూస్తూ గొణుక్కున్నాడు.

"నా కుద్యోగం లేదు. నువ్వు నన్ను పోషించేస్తున్నావు చంద్రా! నా బాధ గూడా అదే. నువ్వు నాకోసం ఉద్యోగం మానేయ్. పైగా నువ్వు నర్సువి. ఒకనాడు నన్నలరించిన ... వొద్దు చంద్రా! నువ్వు మంచి దానివి పైగా

దేవతవి. నేనేం నీకు చెప్పలేను. శాసించే అధికారం నీ మంచి తనం తినేసింది."

బుజ్జిగాడి యేడుపు విని మళ్ళా లేచి నించున్నాడు సుబ్బారావు. గబగబా వాడిదగ్గిరకెళ్ళాడు. రెండు చేతుల్తో వాడి నెత్తుకుని గుండెలకు హత్తుకుని అన్నాడు.

"నువ్వొకడివి బుజ్జీ! అమ్మప్రాణం తినేస్తున్నావ్ వెధవ! చంద్రా నన్ను క్షమించు. మరేంలేదు నేను నీకేం చెప్పలేను. అన్నం వడ్డించావుకదూ, తినేస్తాను చంద్రా. చాలా ఆకలిగావుంది. వెధవది నాకుద్యోగం లేదుగదూ అంచేత నోటికొచ్చినట్లు వాగేస్తున్నాను."

అతను కంచంముందు కూర్చున్నాడు, చంద్రావతి లోలోపల ఏడ్చేసింది. సుబ్బారావు అన్నంతినడం పూర్తి చేసేడు.

ఆ సాయంత్రం అతను స్నానంచేసేడు. చక్కగా తల దువ్వుకున్నాడు. చంద్రావతిముందొచ్చి నించున్నాడు.

"వొస్తా చంద్రా! మళ్ళా యిప్పుడే వొస్తాను. స్టేషన్ వరకూ వెళ్ళొస్తాను. వొస్తారా బుజ్జీ! వొస్తా."

ఇల్లొదిలి స్టేషనురోడ్డువెపు గబగబా నడుచుకుంటూ వెళ్ళేడు. స్టేషను చేరేసరికి మద్రాసు మెయిలొచ్చి అయిదు నిమిషాలయిందని ఎవరో చెప్పేరు. వేగంగా ప్లాటుఫారం మీదికి గెంతేడు. సుబ్బుల్ని స్పష్టంగా చూళ్ళేదుగాని సుబ్బులు చుట్టూతా మూగిన జనాన్ని చూసేడు. వాళ్ళ

ఖరీదైన వేషాల్ని చూసేడు. మతిపోయినట్లయింది. ఓగోడకి చేరగిలపోయేడు.

సుబ్బులు కంపార్టుమెంటుదగ్గిర జనంనుంచి మంద హాసాలూ, అట్టహాసాలూ వివిధరకాలుగా వినిపిస్తున్నాయి. తలుపుదగ్గిర నుంచున్న సుబ్బులు "సగం" కనిపించింది. పూర్వపు బంగారుబొమ్మకి యీమధ్య వగిషీతనం ఎక్కువైనట్టు పసిగట్టేయగలిగాడు, జనంతో చెప్పేయాలి.

ఏమండోయ్! జెంటిల్మెన్ ఆఫ్ ది సిటీ. పురప్రముఖుల్లారా! పెద్దలారా! ఆవిడెవరనుకున్నారు? మాసుబ్బులు. ఆఫ్టరాల్ జె. వెంకటేశ్వర్లు అండ్ సన్స్‌లో సేల్సుగర్ల్. అమ్మకంచేసే ఆడకూతురు. ఆవిడ్నెందుకు ఆకాశానికెత్తేస్తారు? ఇక్కడ నేనున్నాను. పైచెప్పబడిన సంస్థలో యజమానిగా చెలామణి అయిన శ్రీ శ్రీ వి. సుబ్బారావుగార్ని. మీరంతా నాదగ్గరకు రండి. వేగంగా వొచ్చేయండి! నే నా పిల్లతో ఏకాంతంగా మాటాడేందుకు అవకాశమివ్వండి: మీ దొంగచూపులూ, నక్కవినయాలూ, కారాకిళ్ళీ కళ్ళూ, వాసనగొట్టే నోళ్ళు, జడ్డివాళ్ళూ సుబ్బులుకి దూరంచేయండి తప్పుకోండిముందు సుబ్బులూ నేనొచ్చేశాను. సుబ్బులూ, నామీద జాలిచూపించు. "ఏమండీ! నా యజమానిగారూ! బాధపడుతున్నారా" అని సముదాయించు సుబ్బులూ.

రైలు కదిలేముందు ఓ అడుగు ముందుకువేశాడు. సుబ్బారావు సుబ్బులు తెల్లటిచెయ్యి గాలిలో వూగడం మాత్రం చూసేడు. వేగంగా రెండడుగులు వేశాడు. సుబ్బారావుని సుబ్బులు చూచింది. గాలిలో హేళనగా నవ్వినట్టు

ఓ చిన్న చిన్నవ్వు విసిరింది. అది తిన్నగా గుండెల్లో దూసుకు పోయినట్లయింది సుబ్బారావుకి.

అతను నీరసంగా ఇంటివేపు నడిచాడు. అక్కడ ప్లాట్ ఫారంమీద నించుని చేతులూపుకుంటూ మాటాడిన పెద్ద మనుషులు ఆఫ్ ది సిటీ కారుల్లో శరీరాలు పారేసుకుని దూసుకుపోయేరు.

సుబ్బారావు తన దుర్విధిని తిట్టుకున్నాడు.

ఇంటికొచ్చేసరికి చంద్ర డ్రెస్సై రెడీగా వుంది నైట్ డ్యూటీకి వెళ్ళేందుకు. ఆమె నా దుస్తుల్లో చూచింతర్వాత సుబ్బారావు మనసు చివుక్కుమన్నది. రోగులకు సేవచేసే నిమిత్తం వెళ్ళబోతున్న చంద్రం తన మనసులోని రోగాన్ని అనుక్షణం పెద్దదిగా చేస్తోంది. సుబ్బారావు తలొంచుకు ఇంట్లో అడుగుపెట్టాడు.

ఇంట్లోకి వెడుతున్న సుబ్బారావుని చూచి చంద్ర అన్నది.

"బుజ్జి జాగ్రత్త, మీరు త్వరగా నిద్రపోండి. ఫ్లాస్కులో పాలుకాచిపోశాను."

"వెళ్ళిరా చంద్రా! నాపనులు నేను చూచుకుంటాను ఇంకా నాకు నుతుంది. పోలేదు. నువ్వెళ్ళిరా. బుజ్జీ, నువ్వే డవమాకొ రేయ్. మీఅమ్మ ఉద్యోగానికెళ్ళోస్తుంది. నాప్రాణం తీయకు నాన్నా!"

"భగవంతుడా" అన్నది చంద్ర.

"నేనేం మాటాడను చంద్రా, ఏంమాటాడను నోరు మూసుకూర్చుంటాను వెళ్ళిరా"

చంద్ర వెళ్ళిపోయింది.

* * *

బాగా రాత్రివేళ బుజ్జిగాడు నిద్రలో కదలడం గమనించి బుర్రలోని ఆలోచనలని తాత్కాలికంగా తోలేశాడు సుబ్బారావు. గోడగడియారం తాలూకు క్లిక్ క్లిక్ శబ్దం సుతిమెత్తగా వినిపిస్తూన్న వేళ బుజ్జిగాడు కదిలి తన ఏకాగ్రతనీ ఆలోచననీ ఖూనీచేసేశాడు. నిద్రలో బుజ్జిగాడు అందంగా వున్నాడు. అలనాడు మండిపోతున్న నొసటిమీద చల్లటి చేతినుంచి "మీకేం పర్లేదు. మీరు బాగుపడతారు, నిజం. మీరు ఆరోగ్యంగా వుంటారు. దేముడు మీయందుంటాడు" అన్నప్పటి చంద్ర నిశ్చలమైన చూపూ నిర్మలమైన మొహాన్ని పుణికి పుచ్చుకున్నాడు బుజ్జి.

"బుజ్జీ! నీకు సుఖంలేదురా తండ్రీ!" అనుకున్నాడు సుబ్బారావు.

వెంటనే అతనిమనసు హాస్పిటల్లో ఓ వార్డుపైన లగ్నమైంది. ఎవరో రోగి బాధలోమూలిగేడు, చంద్రావతి అటువేపు వెళ్ళిపోయింది. అతని మంచంపక్కన నించుని మెత్తగా నవ్వింది.

"మీరు బాగా నవ్వగలరు. అలాగేనవ్వండి. మీరు నవ్వకపోతే నాకేం తోచదసలు. నవ్వండి ప్లీజ్" రోగి పిచ్చిగా అనేస్తున్నట్లున్నాడు.

చంద్రావతి నవ్వుతున్నట్టేవుంది. రోగి ఆవేశంతో మాటాడేస్తున్నట్టే వున్నాడు. ఆనాడు అలాగే మాటాడి చంద్రావతి హృదయంలో స్థానం సంపాయించుకున్నాడు

సుబ్బారావు. ఈనాడు నాలుగురోజుల్లోనే కన్నుమూసే ఆ ఫలానాగాడు ఆశగా, వెర్రిగా మాటాడేస్తున్నాడు. చంద్రావతిని మరో మగాడి మత్తులో తోసేయకు భగవంతుడా! చంద్రావతి నాభార్య. ఒక నిరుద్యోగికిభార్య. ఈ మొగుడ్తో విసిగిపోయిన యిల్లాలు. ఈ సమయాన ఆమెమనసు మరో మనిషిని, మరో రోగినీ కోరుకోవచ్చు. అలాచేయకు. నన్న న్యాయం చేయకు.

ఎవరో కుర్రడాక్టరు కళ్ళల్లో కోరికనింపుకుని చంద్రావతివేపు విసురుగా వొస్తున్నట్టూ, చంద్రావతి రోగిమంచం వొదిలి ఆ కుర్రడాక్టరువేపు మెల్లిగా హంసలా నడిచినట్టూ మరోకొత్త "ఊహాగానం" చేసి గుండెల్లో పోటుతెచ్చేసుకున్నాడు సుబ్బారావు. అలాగే ఆయాసంతో కళ్ళు గట్టిగా మూసేసుకున్నాడు.

ఆ ఉదయం చంద్రావతి పెందరాళే వొచ్చేసింది ఆమె మొహంలో ఆర్నెల్లనుంచిలేని తృప్తీ వెలుగూ నిండుకున్నాయి. సుబ్బారావుకిఆమె మొహంచూడగానేదడకలిగింది.

"మంచివార్త చెప్పేదా?"

"చెప్పు చంద్రా! నీకైనా "మంచి" జరగనివ్వు."

"ఇది నాగురించికాదు."

"మరి?"

"మీగురించి."

"చంద్రా! ఉదయమే వేళాకోళంచెయ్యకు నువ్వు. చచ్చిబతుకుతూన్నమనిషి న్నేనునాకింకామంచేమిటివల్లకాదు"

"మీకు డాక్టర్ సుదర్శనరావు బాగా తెలుసుగా."

సుబ్బారావుకి డాక్టర్ సుదర్శనరావు బాగా తెలుసు. తెల్ల వారుతూండగా చంద్రావతి నైతిక పరిధుల్ని కించపరిచే నిమిత్తం చేసిన ఊహాగానంలోని కుగ్రడాక్టరతనే! అంచేత తెలుసునన్నట్టు సిగ్గుగా, చెదురుగా తలూపేడు.

"ఆయనో మాటాడేను."

మాటలే ఆడిందో లేక అతని మనసులోనే ఆడిందో! "చంద్రా ఇక చెప్పకు" అందామనుకుని నోరు తడిచేసుకు వూరుకున్నాడు.

"కాకినాడలో మీా కుద్యోగం వేయిస్తానన్నారాయన" అన్నది చంద్ర ఉత్సాహంగా.

సుబ్బారావునె త్తిన పిడుగుపడినట్లయింది.

వొద్దు చంద్రా! నన్నింకా చేతకానివాడిగా తయారు చేయకు. నీ ప్రయోజకత్వంతో నన్నుద్ధరించకు. ఆ డాక్టరుకీ నీకూ వెయ్యి నమస్కారాలు. నన్నిలా బతకనివ్వు. మరో మాట. నన్ను గురించీ, నా చేతగానితనం గురించీ నువ్వెవ్వరికీ చెప్పనక్కరలేదు. నీకా అధికారవుూలేదు. తెలిసిందా? అయినా చంద్రా! నువ్వు కరుణించి నాకు వేయించబోయే ఉద్యోగం నేనెలా చేస్తాననుకున్నావసలు, నీకు తెలీదేమీా. నువ్వంటే నాకు భయంగా వుందిప్పుడు. దైవసాక్షిగా నువ్వు నన్ను భయపెట్టేస్తున్నావ్ ..." చివర్ని మాటాడబోయేది ఆపి కళ్ళు తుడుచుకున్నాడు పిరికి వి. సుబ్బారావు.

"భగవంతుడా! మళ్ళా భగవంతుడ్ని తలిచింది చంద్రావతి.

—జయశ్రీ మాసపత్రికనుండి